క్లుప్తంగా

ఘనంగా అనఘాష్టమి



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి, అనఘాదేవి ఉత్సవమూర్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో అనఘాష్టమి సందర్భంగా గురువారం దత్తాత్రేయ స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయస్వామి అనఘాదేవిల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అనఘాదేవి వ్రతాన్ని ఆచరించి పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని అర్చించారు. పూజా కార్యక్రమానంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. శ్రీపాద వల్లభ సేవాసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వ ఊతం



సాగులో ఉన్న బీర తోట

అట్లూరు : ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఊతమిస్తుందని బద్వేలు ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి పేర్కొన్నారు. బద్వేలు మండల పరిధిలో సాగు చేసిన బీర మరియు అవకాడో పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట్ల తోటలు (ఉద్యాన పంటలు) కూరగాయలు సాగు చేసుకునే రైతులకు హెక్టారుకు మూడేళ్ల పాటు రూ.30 వేలు ప్రోత్సాహకం కింద ఇస్తామన్నారు. ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవాలన్నారు. అలాగే బద్వేలు మండల పరిధిలోని వల్లెరవారిపల్లి గ్రామ పొలంలో తిరుపాల్‌రెడ్డి సుమారు వెయ్యి అవకాడో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇంతవరకూ జిల్లాలో అవకాడో మొక్కలను రైతులు సాగు చేయలేదని ఈయనే ప్రథమంగా సాగు చేస్తున్నామన్నారు.

రక్తదానం

పోరుమామిళ్ల : గిరినగర్‌కు చెందిన గర్భిణి మమతకు సుందరయ్య కాలనీకి చెందిన ఆర్మీ ఉద్యోగి వనిపెంట రమణ గురువారం రక్తం ఇచ్చి ఆదుకున్నారు. ఈ సందర్భంగా రైట్ హ్యాండ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు రసూల్, ప్రసాద్‌లు మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు చేసిన మూడు సంవత్సరాలల్లో 1000 మందికి రక్తం ఇప్పించినందుకు గర్వంగా ఉందన్నారు. ఇంతటి విజయంలో పాలు పంచుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సబ్సిడీతో విత్తనాలు

మైదుకూరు : కేసీ కాలువ ఆయకట్టు పరిధిలోని అన్నలూరు, శివపురం, ఎస్.మైదుకూరు, ఎన్.మైదుకూరు గ్రామాల రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. మినుములు, జొన్నలు అందుబాటులో ఉన్నాయని ఏట తెలిపారు. వీబీఎన్-8 రకం మినుములు పూర్తి ధర రూ.11,750 కాగా 80 శాతం సబ్సిడీతో రైతు రూ.2,350 చెల్లించాలని తెలిపారు. జొన్నలు పూర్తి ధర (మూడు కేజీల బ్యాగ్) రూ.700 కాగా రైతు రూ.140 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పాస్ పుస్తకాలు తీసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పోషకాహారం వినియోగించుకోవాలి

ప్రొద్దుటూరు : గర్భవతులు, బాలింతలు, చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మెనూలో మార్పు చేసిందని ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ అరుణ కుమారి తెలిపారు. పోషకాహార మాసోత్సవంలో భాగంగా గురువారం సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని 1, 2, 3, 4 సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళా కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యతగల పోషకాహారాన్ని సరఫరా చేస్తోందని, వీటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రొద్దుటూరు : శ్రీనివాస నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మహబూబ్ అనే దివ్యాంగుడికి మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రూ.5 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుసేన్ మాట్లాడుతూ మహబూబ్‌కు గతంలో కాలు విరగడంతో ఆపరేషన్ చేసి రాడ్లు వేశారన్నారు. అయితే మళ్లీ కిందపడటంతో కాలు వాపు వచ్చి చీము కారుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని తెలిపారు. డాక్టర్ వద్దకెళితే ఆపరేషన్ చేసి రాడ్లు బయటికి తీయాలని చెప్పారన్నారు. తిరుపతికి వెళ్లాలని డాక్టర్ సూచించారన్నారు. అయితే అక్కడికి వెళ్లేందుకు కూడా మహబూబ్‌కు ఆర్థిక స్తోమత లేదని పేర్కొన్నారు. దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎస్ఎం బాషా, అల్తాఫ్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



పోరుమామిళ్ల: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కలసపాడు: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో విద్యార్థులు



అట్లూరు: ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ, వేణుగోపాలస్వామి మూర్తులు



ప్రొద్దుటూరు కల్చరల్ : కృష్ణాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, వంశీ కృష్ణయాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక శ్రీకృష్ణాలయంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ గోశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని, ప్రభుత్వం ద్వారా కూడా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీతో పాటు విశాఖపట్నం ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డిలను కృష్ణాలయ యాదవ సేవాసంఘం వారు సత్కరించారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్, కమిటీ ప్రతినిధులు శాలువ కప్పి ప్రసాదం అందచేసి సత్కరించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మండల పరిధి కామనూరు శ్రీ ప్రసన్న వేణుగోపాల మాధవ గోసంరక్షణ శాలలో శ్రీకృష్ణాష్టమి వేడకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి శ్రీకృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను, శ్రీకృష్ణుని విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక ప్రముఖ్ శివశంకర్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చితిరాల నాగార్జున, డాక్టర్ సోమా లక్ష్మినరసయ్య, విజయకుమార్, నాగమునిరెడ్డి, వీరభద్రయ్య, చలపతి పాల్గొన్నారు.

కలసపాడు : అమ్మవారిశాలలోని శ్రీ కృష్ణ మందిరంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.నాగరాజ, ప్రధాన కార్యదర్శి జె.నారాయణ, సత్యవతమ్మ, శకుంతల, రామసుబ్బమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. అలానే స్థానిక సెయింట్ ఆంటోనీస్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పోరుమామిళ్ల : పట్టణంలోని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి మందిరంలో గురువారం నిర్వాహకురాలు స్వప్న ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు స్వప్న మాట్లాడుతూ పరమాత్ముని ధర్మ స్థాపనా కర్తవ్యానికి స్మృతి చిహ్నమే కృష్ణాష్టమి అన్నారు. అలానే శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయ అధ్యక్షుడు పెసల నరసింహులు ఆధ్వర్యంలో పూజలు, వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామోత్సవం వైభవంగా జరిగాయి. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం కనుల పండువగా జరిపారు.

అట్లూరు : మండలంలోని కమలకూరులో రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ధ్వజస్థిర, చర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం ప్రతిష్ఠా హోమము, మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలను వేదపండితులు బ్రహ్మశ్రీ లక్ష్మీనరసయ్య బ్రహ్మత్వమున బ్రహ్మశ్రీ సుబ్బరామశర్మ, బ్రహ్మశ్రీ శంకర శర్మల ఆచారత్వమున నిర్వహించారు. ఉదయం 11 గంటలకు శివరామానంద సరస్వతి స్వామి వారిచే యంత్ర విగ్రహముల ప్రతిష్ఠ నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు వడ్డమాని వెంకట సుబ్రమణ్యంరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

బద్వేలు అర్బన్ : అనంతగిరి క్షేత్రంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో గురువారం నిర్వహించిన రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం వైభవంగా జరిగింది.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమ్ పాఠశాలలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేషధారణలో గౌతమ్ స్పార్క్స్ పాఠశాల విద్యార్థులు

• కల్యాణం.. కమనీయం



రాజుపాళెం : తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు

రాజుపాళెం : కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని మండలంలోని అర్కటవేముల గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వంశ పారంపర్య ఆలయ అర్చకులు క్రిష్టపాటి వెంకయ్య స్వామి కుమారుడు నందకిషోర్, గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఈ కల్యాణాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామంలోని మహిళలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఈ కల్యాణాన్ని చూసేందుకు తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు చేసిన కోలాటం అలరించింది. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగించారు.



రాజుపాళెం : కల్యాణానికి తరలివచ్చిన మహిళలు

సమతుల ఆహారం తీసుకోవాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీరా

మైదుకూరు : గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీరా తెలిపారు. గురువారం మండలంలోని విశ్వనాథపురం, ఆదిరెడ్డిపల్లె గ్రామాల్లో పోషణ్ మాసోత్సవాల సందర్భంగా పౌష్టికాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాంసకృతులు సరైన మోతాదులో లేకపోయినా, విటమిన్లు, ఖనిజలవణాలు అధికంగా తీసుకున్నా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అందువల్ల సమతుల ఆహారమే మంచిదన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని, వారి పెరుగుదలకు ఎంతో దోహదపడుతాయన్నారు. స్థానికంగా దొరికే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత ప్రమాదకరమని, రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, శుద్ధినీరు, పోషకాహారం, పోషక విలువలు కోల్పోకుండా వంట చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వనాథపురం హెడ్మాస్టర్ మధుసూదనరాజు, ఎంఎస్‌కే విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సావిత్రి, ఏఎన్ఎం ప్రసన్నకుమారి, విశ్వనాథపురం, ఆదిరెడ్డిపల్లె పంచాయతీల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చెమ్ముళ్ళపల్లె ప్రాథమిక పాఠశాలలో సూచనలు చేస్తున్న వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు

ఖాజీపేట : రానున్నది శీతాకాలం కనుక సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అందుకే వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. కొత్తపేట గ్రామంలోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంను ఆయన పరిశీలించి అనంతరం చెమ్ముళ్ళపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో నులిపురుగుల మందుల పంపిణీని పరిశీలించారు. అనంతరం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఖాజీపేట వైద్యాధికారి డాక్టర్ ఆయేషా సుల్తానా, సూపర్ వైజర్ శోభన్‌బాబు, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



యూనిఫాంలో స్కౌట్స్ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.లక్ష్మీకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళ్లమాపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నేతాజీ స్కౌట్ ట్రూప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ స్కౌట్‌ద్వారా క్రమశిక్షణ ఇంకా పెరగాలని పేర్కొన్నారు. స్కౌట్ మాస్టర్ డీపీ సుబ్బానాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణను పెంచడానికి బేడన్ పౌల్ స్కౌట్‌ను స్థాపించారని తెలిపారు. పూర్వవిద్యార్థి జగదీశ్వరరెడ్డి తన తల్లిదండ్రులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటలక్షుమ్మల ద్వారా 30 మంది విద్యార్థులకు స్కౌట్ డ్రస్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపీనాథరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆర్సీఎం కరస్పాండెంట్, ఎంఈఓ

బద్వేలు అర్బన్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఆర్సీఎం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రెవ. ఫాదర్ విజయరావు, గోపవరం మండల విద్యాశాఖాధికారి చెన్నయ్యలు పేర్కొన్నారు. గోపవరం మండలం ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపికలు గురువారం పట్టణంలోని ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో ఫాతిమా హైస్కూల్ విద్యార్థులు, కబడ్డీలో పూసలవాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఖోఖోలో రాచాయపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఆర్సీఎం, పూసలవాడ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చిన్నప్ప, సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, సుబ్బారావు, పీరాన్ సాహెబ్, మల్లికార్జున, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బి.ఎస్.నారాయణరెడ్డికి సేవారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నారాయణరెడ్డి

కాశినాయన : సంఘ సేవకుడు, యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డికి అఖిత భారత ఎన్జీఓ సంక్షేమ సంఘం, కేబీఆర్ ఫౌండేషన్ వారు జాతీయ సేవారత్న పురస్కారాన్ని అందించారు. గురువారం ఈ సందర్భంగా కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలరాజు మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ గురూజీ ఆధ్వర్యంలో బి.ఎస్.నారాయణరెడ్డి సేవలందించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు శ్రీకాంత్, రమేష్‌లు పాల్గొన్నారు.

పరామర్శ

చాపాడు : కుచ్చుపాప గ్రామానికి చెందిన చెన్నకృష్ణ యాదవ్ బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి గురువారం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చెన్నకృష్ణయాదవ్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామన్నారు. ఆయనతోపాటు ఎంపీపీ లక్ష్మయ్య, కుచ్చుపాప గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కలసపాడు : విద్యార్థులు క్రీడలతో మానసిక ఉల్లాసం పొందడంతో పాటు శారీరక దృఢత్వాన్ని పొందవచ్చని కలసపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 12, 13వ తేదీల్లో ఉన్నత పాఠశాలలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ గేమ్స్‌లో పాల్గొనాలంటే ముందుగా అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో మండల స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్ సగిలిసుమన్, వ్యాయామ ఉపాధ్యాయులు సుమంత్, రమాదేవి, కోమలి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

పోరుమామిళ్ల : చెరువుకట్ట వద్ద నిర్మిస్తున్న భైరవ స్వామి ఆలయానికి డాక్టర్ ఎస్‌వీవీ ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ మృదుల దంపతులు గురువారం రూ. 60 వేలు విరాళంగా ఇచ్చారు. తన తండ్రి డాక్టర్ ప్రసాద్ జ్ఞాపకార్థం విరాళం ఇస్తున్నానని తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరివాడు అని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ఏదో పథకం ద్వారా లబ్ధి పొందుతుందని మహిళలు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దోచుకున్నారన్నారు. మనందరి ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాలు పారదర్శకంగా అమలువుతున్నాయని తెలిపారు. అందరి మేలు కోరుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ముజఫర్ రహీమ్, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, స్థానిక సర్పంచ్ పిచ్చిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, రాఘవరెడ్డి, రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

13 నుంచి ఆటలు, పోటీల ఎంపికలు

మైదుకూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు 9 రకాల గేమ్స్, అథ్లెటిక్స్‌లో ఈనెల 13, 14 తేదీల్లో పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్లు నాయక్, వినోనియారాణి, చంద్రావతిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ ఏలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్ గ్రూప్‌బీలో టెన్నికాయిట్, షెటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు ఎంపికలు ఉంటాయన్నారు. పోటీల్లో 14 ఏళ్లలోపు బాలికలు 45 కిలోలు, బాలురు 48 కిలోలు, 17 ఏళ్లలోపు బాలికలు 50 కిలోలు, బాలురు 54 కిలోలు బరువు ఉండాలని తెలిపారు. 13వ తేదీ మైదుకూరులోని మేధా కళాశాలలో పోటీలు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లు, కస్తూర్బా పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు తమ క్రీడాకారులతో ఉదయం 9 గంటలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ పోటీలకు సంబంధించి ప్రవేశ దరఖాస్తులను సోమవారం సాయంత్రం 3 గంటలలోపు మైదుకూరు జెడ్పీహైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులకు అందజేయాలన్నారు. గేమ్స్ రోజున మాత్రం క్రీడాకారులకు భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు.